# సాక్షి ప్రకాశం

మంగళవారం । 5 । నవంబర్ । 2024






**కూరగాయలొద్దు.. ఊరగాయ చాలు !**

కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. క్యారెట్ సెంచరీ కొట్టగా, బీన్స్ డబుల్ సెంచరీకి చేరువైంది. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. - 8లో..



**గంజాయి కోసం వలవేస్తే.. బంగారం దొరికింది**

గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పొదిలి పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. - 8లో..

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
34/25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### నేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం

**ఒంగోలు సిటీ:** జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లతో మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిలు సమీక్ష సమావేశంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ కమిటీ, అనుబంధ సంఘాల కమిటీ నిర్మాణం గురించి చర్చించనున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు

**ఒంగోలు సిటీ:** ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏకేయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.పద్మజ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 88 డిగ్రీ కళాశాలల నుంచి మొత్తం 6,942 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు 35 పరీక్ష కేంద్రాలను, అదే విధంగా 16 నోడల్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించేందుకు 40 మంది పరిశీలకులను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం కోసం రెండు స్క్వాడ్ బృందాలను నియమించారన్నారు.

### ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

**ఒంగోలు టౌన్:** ఎయిర్‌పోర్టులో హెల్పర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ చెప్పిన ఒక వ్యక్తి అందుకుగాను రూ.35 వేలు ఫోన్ పే చేయించుకొని ఆ తరువాత ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని తాళ్లూరు మండలానికి చెందిన ఒక వ్యక్తి సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఎస్పీని కలిసి తాను మోసపోయిన విధానాన్ని చెప్పుకున్నాడు. ఆన్‌లైన్లో ఉద్యోగాల కోసం సెర్చ్ చేస్తుండగా అతడు పరిచయమయ్యాడని తెలిపారు. నమ్మకంగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన అతడు డబ్బులు వసూలు చేసుకున్నాక ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించానని వాపోయాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్న ఎస్పీ వారితో సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆయా పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో దిశ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీవుల్లా, ఎస్సీ ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ సహాయకుల జిల్లా సంఘం అధ్యక్షునిగా బత్తుల

**పొదిలి:** వ్యవసాయ గ్రామ సహాయకుల (అగ్రికల్చర్ డిప్లొమో) జిల్లా సంఘం అధ్యక్షునిగా బత్తుల వెంకట సుబ్బయ్య (కనిగిరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సాయంత్రం స్థానిక శ్రీవీరిశెట్టి జూనియర్ కళాశాలలో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేటెడ్ అధ్యక్షునిగా శ్రీరామ ఏడుకొండలు (ఉలవపాడు), గౌరవాధ్యక్షునిగా జక్కి గణేష్ (మార్కాపురం), ఉపాధ్యక్షులుగా ఎం.గౌస్ లాజం (మార్టూరు), ఎస్‌కె.మస్తాన్ (వై.పాలెం), వి.సుమంత్ (రాచర్ల), జి.రమేష్‌బాబు (చీమకుర్తి), ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వెంకటేష్ (చీమకుర్తి), కోశాధికారిగా కె.సుభాషిణి (ఒంగోలు), సంయుక్త కార్యదర్శులుగా రాణా ప్రతాప్ నాయక్ (గిద్దలూరు), బి.నవ్య భారతి (మార్కాపురం), మృధులత, ఎస్‌కె.అజారుద్దీన్ (వెలిగండ్ల), ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.వినోద్‌కుమార్ (చీరాల), పబ్లిక్ సెక్రటరీగా ఎస్‌కె.అబీద్, మహిళా కార్యదర్శిగా వానిరెడ్డిలతో పాటు మరో పదకొండు మందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### ఎస్‌జీఎఫ్ స్విమ్మింగ్ క్రీడాకారులు వీరే

**ఒంగోలు:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక సోమవారం స్థానిక రాంనగర్ 14వ లైనులోని టార్గెట్ డ్రిల్ బేస్ క్యాంపులో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ హజీరాబేగం అభినందించారు. అండర్ 14 స్విమ్మింగ్ పోటీలకు ఉప్రాఫిమొనో కొల్లం, చక్కా సాత్విక, కొల్లం ఆస్టిన్ రాయిస్, అనీష్ పి, చక్కా శ్రీమంత్ ఎంపికయ్యారు.



ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నగరోత్సవంలో ఒంగోలు కేశవస్వామి పేట కాశీవిశ్వేశ్వర స్వామి



జమ్ములపాలెంలో మహాశివునికి పూజలు చేస్తున్న భక్తులు

## ఓం..శివోహం

మహాశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం తొలి సోమవారం నాడు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పలుచోట్ల ఆలయాల్లో దీపోత్సవాలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని శివాలయాలతో పాటు, జమ్ములపాలెం, భైరవకోన, త్రిపురాంతకం వంటి శైవక్షేత్రాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అవస్థలు 'అపార్'ం

నూతన విద్యా విధానంలో భాగంగా ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో తెచ్చిన ఆటోమెటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఆధార్ కార్డు తరహాలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ చదివే విద్యార్థులకు 12 అంకెల జీవితకాలపు ఐడీ కార్డు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆధార్‌కు విద్యార్థికి సంబంధించి స్కూలులో ఉన్న వివరాలు తేడాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వరకూ 56 శాతం మాత్రమే అపార్ నమోదు పూర్తయింది.

- ఆధార్ కార్డులో ఒకలా, స్కూల్ రికార్డుల్లో మరోలా
- నత్తనడకన అపార్ నమోదు ప్రక్రియ
- జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఇక్కట్లు
- ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి

**కనిగిరి రూరల్:** నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీకి సంబంధించి కేంద్రం మూడేళ్ల కిందట మార్గదర్శకాలను జారీ చేసింది. విద్యార్థుల పూర్తి వివరాలను పొందుపరుస్తూ ఆటోమెటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో గుర్తింపు కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగ పడుతుంది. అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, అలాగే ఇంటర్ విద్యార్థులకు వీటిని జారీ చేసేందుకు నిర్ణయించారు. జిల్లాలోని 38 మండలాల్లో 3,104 పాఠశాలల్లో 3,20,179 మంది




| | |
|---|---|
| జిలాల్లోని మండలాలు | 38 |
| పాఠశాలల సంఖ్య | 3,104 |
| మొత్తం విద్యార్థులు: | 3,20,179 |
| ఇప్పటి వరకు జనరేట్ అయిన విద్యార్థుల సంఖ్య: | 1,80,221 |

విద్యార్థులుండగా, మొత్తం 1,80,221 విద్యార్థుల సంఖ్య (56.29 శాతం) జనరేట్ అవ్వగా, ఇంకా 1,39,958 మంది విద్యార్థులవి జనరేట్ కావాల్సి ఉన్నట్లు నివేదికలున్నాయి. 1–5 తరగతుల విద్యార్థుల సంఖ్య కొంత మేర వేగంగా ఉన్నా.. మిగతా 6–10 తరగతుల విద్యార్థుల సంఖ్య నత్తనడకన జరుగుతున్నట్లు సమాచారం. వాటి నమోదులో ఎక్కువగా ఆధార్ సమస్యలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ నెలాఖరులోగా అపార్ వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

**విద్యార్థుల వివరాల్లో తేడాలు..**

పాఠశాలలో వివరాలు ఆధార్ సమాచారంతో సరిపోల్చి సరిగా ఉన్నప్పుడే అపార్‌లో నమోదవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబరు, తలిదండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్యలలో ఏది తప్పుగా చూపినా నమోదు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కార్డుల జారీ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయకపోతే తాఖీదులు ఇస్తామని ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చాలా మంది విద్యార్థులకు సంబంధించి పాఠశాల రికార్డుల్లో నమోదైన సమాచారానికి, ఆధార్‌లో వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, సెల్ నంబరు పరంగా ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయి. చిరునామా సైతం ఆధార్‌కు, పాఠశాల రికార్డులకు తేడా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. చాలా పాఠశాలల్లో 30 నుంచి 50 శాతం మంది విద్యార్థుల వివరాలు ఆధార్ కార్డులతో సరిపోతున్నాయి. ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులుంటున్నాయి. ఒక సారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఇదే నంబరు ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల నమోదులో పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

**జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఇక్కట్లు:**

ఆధార్‌లో తప్పులను సవరించుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు జనన ధ్రువీకరణ పత్రాల కోసం నానా అగచాట్లు పడుతున్నారు. గతంలో మంజూరు చేసిన జనన ధ్రువీకరణ పత్రాలున్నా.. అందులో తప్పుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని



ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రజలు రెవెన్యూ కార్యాలయం ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలు పొందగా, వాటిలో వివరాలు చేతి రాతతో ఉన్నందున ఆధార్ వివరాల మార్పునకు అంగీకరించడం లేదు. అలాగే జనన ధ్రువీకరణకు సంబంధించి పాఠశాల స్టడీ సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం ఉన్నా అంగీకరించడంలేదు.

**తప్పులు సవరించుకుంటేనే..**

7–8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెత్త ఎత్తున తప్పులు ఉన్నాయి. ప్రస్తుతం అపార్ కార్డును ప్రాధాన్యతాంశంగా పరిగణించాలని చెబుతున్నారు. దీంతో ఆధార్ కార్డులోని తప్పులను సరిచేసుకోవాల్సి ఉంది. ఇందు కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కొన్ని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. కొన్ని చోట్ల ఆధార్ కేంద్రాలు సచివాలయాల్లో పెడుతున్నట్లు అధికారులు ప్రకటనలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో అవి ఆచరణకు నోచుకోలేదనే విమర్శలున్నాయి. దీంతో వేరే గ్రామాలకు, పట్టణాలకు వచ్చి ఆధార్ తప్పులను సరి చేసుకోవాల్సిన పరిస్థితి. చిన్న, చిన్న మార్పులను మాత్రమే ఆధార్ కేంద్రాల్లో సరిచేస్తున్నారు. దీంతో గ్రామీణ విద్యార్థులు పడే అవస్థలు వర్ణనాతీతం.

**ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి**



విద్యార్థుల ఆధార్‌లో వివరాల మార్పునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జనన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించడంతో పాటు విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ప్రతి పాఠశాలలో ఆధార్ అప్ డేట్ కోసం మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– పందిటి మోహన్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, కనిగిరి మోడల్ స్కూల్

# మొక్కుబడిగా డీఆర్‌సీ సమావేశం





సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఆనం, డోలా, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీ మాగుంట, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- రోడ్లపై గుంతలు పూడుస్తామన్న ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- వేదికపై ఫ్లెక్సీలో కనిపించని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటో
- అధికారులు రూపొందించిన నివేదికలను వల్లె వేసిన మంత్రులు

**ఒంగోలు అర్బన్:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి డీఆర్‌సీ సమావేశం సోమవారం మొక్కుబడిగా సాగింది. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఒక్క డీఆర్‌సీ సమావేశం కూడా నిర్వహించలేదు. అనంతరం వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడు సార్లు డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించి జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. కూటమి ప్రభుత్వంలో నిర్వహించిన తొలి డీఆర్‌సీ సమావేశం ప్రకాశం భవనంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వేదికపై ఉంచిన ఫ్లెక్సీలో కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి, జిల్లాలోని మంత్రి ఫొటోలనే ఉంచారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటో లేకపోవడం గమనార్హం. దీనిపై జనసేన పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలు కానీ రైతులకు సంబంధించిన సంక్షేమ పథకాల గురించి కానీ ప్రస్తావన రాలేదు. కేవలం రోడ్లపై గుంతలు పూడుస్తామని చెప్పారు. నీటి ప్రాజెక్టులను ఎప్పటిలోపు పూర్తి చేసి ప్రజలకు నీరు అందిస్తారనేది స్పష్టంగా చెప్పలేదు. అధికారులు తయారు చేసిన నివేదికలను వల్లెవేసి డీఆర్‌సీ సమావేశాన్ని మమ అనిపించారు. సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పర్యాటక సంస్థ చైర్మన్ బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

✦ జిల్లా అభివృద్ధికి ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నిర్దేశించిన శాఖల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన సూచనలు, సలహాలను సభ్యులతో చర్చించి తీసుకున్నామన్నారు. వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు ఉపయోగపడాలన్నా, బీడు భూములు వినియోగంలోకి రావాలన్నా జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఒంగోలు జాతి ఎద్దులు, ఆవులు అంతరించిపోకుండా జిల్లాలోని చదలవాడ పశు క్షేత్రాన్ని ఉపయోగించి వృద్ధి చేయిస్తామని చెప్పారు. దేవదాయ భూములను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. రోడ్లు నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ప్రతి రోజు తాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

✦ మరో మంత్రి స్వామి మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద జిల్లా ప్రకాశంజిల్లా అని, జిల్లాలో అభివృద్ధి పనులకు సమన్వయంతో చేస్తామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో జీడీపీ వృద్ధి రేటు 15 శాతం పెరిగేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

✦ శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు మాట్లాడుతూ జిల్లాను వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

✦ దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాళ్లూరుకు వెళ్లే రహదారిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. మొగలిగుంట ట్యాంకు పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ మంత్రిని కోరారు.

✦ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, త్వరగా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తాగునీటిని ఇచ్చేలా చూడాలన్నారు.

✦ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందచేయాలన్నారు. జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో జిల్లా ఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఓబులేసు, సీపీవో వెంకటేశ్వర్లు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

**చీమకుర్తి:** గ్రానైట్ క్వారీల్లో భద్రతా ప్రమాణాలు క్రమం తప్పకుండా పాటించాలని సౌత్ సెంట్రల్ జోన్ మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ భూషణ్ ప్రసాద్ సింగ్ అన్నారు. 22వ గ్రానైట్ భద్రతా వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి డైరెక్టర్ జనరల్‌తో పాటు మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియా చక్రవర్తి, డీడీఎంఎస్ కే.జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రానైట్ భద్రతా వారోత్సవాలు సోమవారం రామతీర్థం వీటీసీ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఒంగోలు గెలాక్సీ గ్రానైట్ ఆతిథ్యంలో క్వారీ యజమాని చలువాది బదరీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు ఈనెల 9వ తేదీ వరకు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోనున్న అన్ని గ్రానైట్ క్వారీలలో జరుగుతాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా అన్ని గ్రానైట్ క్వారీలలో భద్రతా ప్రమాణాలు, కార్మికుల రక్షణ, పర్యావరణ వంటి పలు అంశాల్లో నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు క్వారీల యజమానులతో ఏర్పాటైన కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహిస్తారు. ఉత్తమ ప్రమాణాలు పాటించిన క్వారీల యాజమాన్యాలకు ముగింపు వేడుకల సందర్భంగా ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు అందిస్తారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లు మాట్లాడుతూ క్వారీలలో భద్రతా ప్రమాణాలను అమలు చేయటం నిరంతర ప్రక్రియలాగా కొనసాగాలని, కార్మికులను ఎప్పటికప్పుడు సుశిక్షితులుగా తయారు చేసుకుంటూ కార్మికుల రక్షణను మెరుగుపరచుకుంటూ పనులు చేయించాలని సూచించారు. అనంతరం గ్రానైట్ క్వారీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్మికులకు శిక్షణనిచ్చే వీటీసీ కేంద్రం ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో కార్మికులకు శిక్షణ మెరుగు పరిచే అవకాశం కల్పించాలని డీడీఎంఎస్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్వారీ యజమానులు ఆర్‌పీ రవి, అజీమ్, ఆర్.లక్ష్మీనారాయణ, స్థానిక యజమానులు పాల్గొన్నారు.



గ్రానైట్ క్వారీలో పనులను పరిశీలిస్తున్న మైన్స్ సేఫ్టీ అధికారులు

## గుండ్లకమ్మకు కొత్త గేట్లు

- గత ప్రభుత్వంలో మంజూరైన రూ.9.14 కోట్లు
- 15 గేట్లలో పూర్తయిన 12 గేట్ల తయారీ

**మద్దిపాడు:** మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తికావచ్చాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణం తరువాత టీడీపీ ప్రభుత్వంలో గేట్ల మరమ్మతులు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మెయింటెనెన్స్‌కు ఇచ్చిన నిధులను బ్యూటిఫికేషన్, విగ్రహాలు అంటూ వృథా ఖర్చులు చేసి సుమారు రూ.6 కోట్లకుపైగా కాంట్రాక్టర్లకు దోచి పెట్టారు. దాని ఫలితంగా గత ప్రభుత్వంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు రెండు కొట్టుకుని పోగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జునలు తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి 2023 సెప్టెంబర్ నెలలో రూ.9.14 కోట్లు మంజూరు చేశారు. ఆ డబ్బుతో ప్రస్తుతం మొత్తం 15 గేట్లలో 12 గేట్లు కొత్తవి చేయించారు. ఈ క్రమంలో 4, 13, 15వ గేట్లు మాత్రం మిగిలిపోయాయని వాటిని కూడా రెండు మూడు నెలల్లోనే ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు డ్యామ్ ఏఈ రామాంజనేయులు తెలిపారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్ లో 12 వ గేటు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### నిద్రిస్తున్న ప్రయాణికుల పర్సులే లక్ష్యంగా..

● రైలులో దొంగతనాలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడు, ల్యాప్‌టాప్‌లతో రైల్వే పోలీసులు

ఒంగోలు టౌన్: అతడి పేరు కుంచాల సతీష్. చీరాల నుంచి గూడూరు మధ్య రైళ్లలో తిరుగుతుంటాడు. నిద్రలో ఉన్న ప్రయాణికుల హ్యాండు బ్యాగులు, పర్సులు, ల్యాప్ టాప్‌లు, మొబైల్ ఫోన్లను క్షణంలో మాయం చేస్తుంటాడు. వాటిలోని విలువైన వస్తువులను అమ్ముకుని జల్సాలు చేస్తుంటాడు. అలాంటి దొంగతనాలపై నమోదైన కేసులపై ఒంగోలు రైల్వే ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలా షరీఫ్, ఎస్ఐ టి.అరుణ కుమారి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఒంగోలు రైల్వేస్టేషన్లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాం చివరన ఎవరి కోసమో వేచి ఉన్న సతీష్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 12 గ్రాముల బంగారు నగలు, రెండు మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాపులను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సీఐ షేక్ మౌలా షరీఫ్ తెలిపారు.

### ఎస్‌డీసీల ఆధ్వర్యంలో గ్రీవెన్స్


గ్రీవెన్స్ నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

ఒంగోలు అర్బన్: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌డీసీలు) ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం భవనంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డీసీ లోకేశ్వరరావు ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు విన్నవించిన సమస్యలపై ఆయా మండలాల అధికారులు, జిల్లా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. డీఆర్సీ సమావేశం ఉండటంతో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనలేదు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు గ్రీవెన్స్ నిర్వహించారు.

### క్రాస్ కంట్రీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న వైఏ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులు

చీరాల అర్బన్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ మహిళలు, పురుషుల పోటీల్లో చీరాల వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. సోమవారం యూనివర్శిటీ పరిధిలో అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ మెన్ అండ్ ఉమెన్ 10 కిలోమీటర్ల పోటీలను చీరాలలో నిర్వహించారు. స్థానిక దండుబాట రోడ్డు నుంచి స్వర్ణ వెళ్లే మార్గంలో నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఈ నెల 18న కర్ణాటకలోని మంగళూరు యూనివర్శిటీలో జరిగే క్రాస్ కంట్రీ పోటీలకు ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరఫున ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో ఈ.స్వాతి, కె.దీపిక, జి.లక్ష్మీ కుమారి, కే రమ్య, బి.దుర్గాభవాని, శివదుర్గ ఉన్నారు. పురుషుల విభాగంలో వై.వెంకట గోపాలకృష్ణ, జి.చిన్న (అమృత డిగ్రీ కాలేజీ), పి.మహేష్ (భారతి డిగ్రీ కాలేజీ), కె.నాగాంజనేయులు, డి.భరత్‌కుమార్ (వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీ) ఉన్నారు. పోటీలకు పరిశీలకుడిగా స్పోర్ట్స్ బోర్డు ఒంగోలు కార్యదర్శి ఐ.దేవీవరప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు జి.సాయిసురేష్ (ఉలవపాడు), బి.రమేష్‌బాబు (కనిగిరి) వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఐ.బాబూరావు పాల్గొని విజేతలను అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీపీఎం నీలాకుమారి, ప్రిన్సిపాల్ ఎన్.మురళి, ఎంఎస్ఆర్ కోచ్ మద్దులూరి వేణు పాల్గొన్నారు.



# కూరగాయలొద్దు.. ఊరగాయ చాలు!






- చుక్కలనంటుతున్న కాయగూరల ధరలు
- సెంచరీ కొట్టిన క్యారెట్.. డబుల్ సెంచరీకి చేరువలో బీన్స్
- మరోవైపు మంట పుట్టిస్తున్న నిత్యావసర వస్తువులు
- ధరలు దించుతామని మొహం చాటేసిన కూటమి నేతలు
- శాపనార్థాలు పెడుతూ దుమ్మెత్తిపోస్తున్న సామాన్యులు

వంటింట్లో పొయ్యి వెలగాలంటే రోజూ వందల్లో ఖర్చు చేయాల్సి వస్తుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు చుక్కలనంటుతుండటంతో కొనేందుకు జంకుతున్న పరిస్థితి. కూలీనాలీ చేసుకుని బతుకులు వెళ్లదీస్తున్న పేదలు పచ్చడి మెతుకులతో కడుపు నింపుకొంటూ కూరగాయల జోలికి వెళ్లేందుకు సాహసించడం లేదు. తాము అధికారంలోకి వస్తే ధరలు దించుతామని కోతలు కోసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలపై సామాన్యులు దుమ్మెత్తిపోస్తూ శాపనార్థాలు పెడుతున్న తీరు అన్ని మార్కెట్లలో చర్చనీయాంశమవుతోంది. మండుతున్న కూరగాయల ధరలు, మంట పుట్టిస్తున్న నిత్యావసర వస్తువులను తలుచుకుని మహిళలు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు.

మార్కాపురం/కొనకనమిట్ల: పొద్దస్తమానం పనిచేసిన కష్టజీవులు నోరారా నాలుగు మెతుకులు తినలేకపోతున్నారు. రోజూ స్వేదం చిందించి పనిచేసిన సొమ్మంతా కూరగాయలు, ఉప్పూ పప్పులకు ఖర్చు చేయాల్సి వస్తుండటమే అందుకు కారణం. చిన్న కుటుంబంలో మూడు పూటలా ముద్ద దిగాలంటే కనీసం రూ.300 ఖర్చు చేయాల్సి రావడంతో.. పేదలు కూరగాయలకు బదులు ఊరగాయ పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుంటున్న దయనీయ పరిస్థితి. మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకెళ్లినా సంచి నిండటం లేదన్నది మధ్య తరగతి ప్రజల ఆవేదన. కూటమి ప్రభుత్వంలో ధరలు తగ్గుముఖం పడతాయని ఆశించిన సామాన్యులు.. అంతకంతకూ పెరిగిపోతున్న ధరలను చూసి గాబరాపడుతున్నారు. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు చెప్పిన మాటలు గుర్తు చేసుకుని ''చెప్పేదొకటి.. చేస్తుందొకటి'' అంటూ దెప్పిపొడుస్తున్నారు.


నిత్యావసర సరుకుల దుకాణం

### ధరల మాయ.. అంతా సర్కారు దయ!

కూరగాయల ధరల్లో వ్యత్యాసం ఉన్నట్టుండి పెరిగిపోతుండటంతో ఆంతర్యం ఏమిటో సామాన్యులకు అంతుచిక్కడం లేదు. కేరళ, తమిళనాడు, కర్నాటక, పశ్చిమబెంగాల్ నుంచి జిల్లాలోని వివిధ మార్కెట్లకు కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. వీటికి తోడు స్థానికంగా రైతులు పండించే కూరగాయలు, ఆకుకూరలు కూడా లోకల్ మార్కెట్లతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రధానంగా బెంగళూరు, కర్నూలు, ఆత్మకూరు, మార్టూరు మార్కెట్ల నుంచి టమోటా, మిర్చి, కాకర, దొండ, బీరకాయలను దిగుమతి చేసుకుంటున్నారు. మార్కాపురం మార్కెట్ నుంచి రోజూ శ్రీశైలం, దోర్నాల, త్రిపురాంతకం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం మార్కెట్లకు కూరగాయలు వెళ్తుంటాయి. ఒంగోలు మార్కెట్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు కూరగాయలు సరఫరా చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలే కూరగాయల ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్‌లో దళారులు చెబుతున్న మాట. కానీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో వర్షాలు ఒకేలా లేవు. కూరగాయలు దిగుమతి చేసుకుంటున్న రాష్ట్రాల్లోనూ వర్షాలు నామమాత్రమే. మరి ప్రతి 10, 15 రోజులకు కూరగాయల ధరలు అమాంతం పెరగడం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఇదే పరిస్థితి. కృత్రిమ కొరతను అరికట్టి, టోకు ధరలు దించడంపై రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం శ్రద్ధ చూపాలని సామాన్యులు డిమాండ్ చేస్తున్నారు.

**మార్కెట్‌లో కూరగాయల ధరలు**

| రకం | కిలో ధర(రూ.లో) |
|---|---|
| వెల్లుల్లి | 400 |
| బీన్స్ | 180 |
| క్యారెట్ | 100 |
| చిక్కుడు | 100 |
| అల్లం | 100 |
| చామదుంప | 80 |
| కంద | 80 |
| బెండకాయ | 70 |
| బీరకాయ | 70 |
| మిర్చి | 60 |
| వంకాయ | 60 |
| బీట్‌రూట్ | 60 |
| కాకర | 60 |
| క్యాలీఫ్లవర్ | 60 |
| ఉల్లిపాయలు | 60 |
| దొండ | 50 |
| దోస | 45 |
| క్యాబేజీ | 40 |
| టమోటా | 40 |
| సొరకాయ | రూ.30 |
| తోటకూర, గోంగూర కట్ట | రూ.10 |
| మెంతికూర, చుక్కకూర, బచ్చలికూర కట్ట | రూ.15 |



నోట్ : ప్రాంతాన్ని బట్టి ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు ఉండొచ్చు

# గంజాయి కోసం వల వేస్తే.. బంగారం దొరికింది

- ● గంజాయి, చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్టు
- ● విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్, వెనుకవైపు ముసుగుల్లో నిందితులు


స్వాధీనం చేసుకున్న గంజాయి

ఒంగోలు టౌన్: గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పొదిలి పట్టణ పోలీసులు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, అందులో కొందరు ఇతర చోరీలకు కూడా పాల్పడినట్లు తెలిసి పోలీసులు ఆశ్చర్యపోయారు. వారి వద్ద నుంచి 1,350 కేజీల గంజాయితో పాటు 303 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆ వివరాలు వెల్లడించారు. ఒరిస్సాకు చెందిన మహేది హసేన్‌కు తాళ్లూరు మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన రావిపాటి జగదీష్‌తో కలిసి అక్రమంగా గంజాయి వ్యాపారం నిర్వహించేవాడు. ప్రస్తుతం జగదీష్ జైలులో ఉన్నాడు. ఒరిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చిన మహేది హసేన్ ఒంగోలు పరిసర ప్రాంతాలలో విక్రయిస్తుంటాడు. మిగిలిన వారిలో ఒంగోలు విజయనగర్ కాలనీకి చెందిన షేక్ కృపారావు ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళల మెడలో గొలుసులు దొంగిలిస్తుంటాడు. ఇతడిపై 23 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. తాళ్లూరు మండలంలోని రామభద్రాపురం గ్రామానికి చెందిన వడిషన వేణుగోపాల్‌రెడ్డికి ఏపీ, తెలంగాణలో అనేక దొంగతనాలకు పాల్పడిన చరిత్ర ఉంది. ఇతడి మీద 15 కేసులు నమోదై ఉన్నాయి. చీమకుర్తికి చెందిన షేక్ తరుణ్ కూడా వేణుగోపాల్‌రెడ్డితో కలిసి చోరీలకు పాల్పడుతుంటాడు. ఇతడి మీద రెండు కేసులున్నాయి. యర్రగొండపాలెం పాములకాలనీకి చెందిన ఆవుల బ్రహ్మయ్య కూడా వీరితో ఉన్నాడు. వీరంతా పల్నాడు జిల్లాలోని వినుకొండ, నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, కందుకూరు, బాపట్ల జిల్లాలోని బాపట్ల, అద్దంకి, తెనాలి తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి ఉన్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి గంజాయి కూడా విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పొదిలి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న ప్లాట్లలో ఖాళీగా ఉన్న స్థలంలో సమావేశమయ్యారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి ఈ ముఠాను అరెస్టు చేశారు. ఒరిస్సా నుంచి తీసుకొచ్చిన 1,350 కేజీల గంజాయిని ఒంగోలు ప్రాంతంలో విక్రయించే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. వీరి నుంచి గంజాయితో పాటుగా సుమారు 303 గ్రాముల బంగారు నగలు, రూ.6,700 నగదు, ఒక మోటారు బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ టి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వేమన, హెచ్‌సీ కె.పూర్ణచంద్రరావు, ఎండీ షాకీర్, ఎస్.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు గౌతమ్ కుమార్, కోటేశ్వరరావు, వీరాజు, బాలమురళిలను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు.


బంగారు ఆభరణాలు

### మద్యం మత్తులో కొట్లాట

● కత్తితో దాడి చేయడంతో ముగ్గురికి గాయాలు


హజరత్ నిజాముద్దీన్ సురేంద్రబాబు

పామూరు: మద్యం తాగుతుండగా ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన వాగ్వివాదం చివరికి కత్తితో దాడికి తెగబడే పరిస్థితికి దారితీసింది. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై టి.కిషోర్ బాబు కథనం మేరకు.. మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన కాటం తిరుపాలురెడ్డి తన స్నేహితుడు జి.సురేంద్రబాబుతో కలిసి శనివారం రాత్రి మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. ఆదివారం తిరుపాలురెడ్డి మద్యం సేవించి గ్రామంలో తిరుగుతూ సురేంద్రబాబు అంతుచూస్తానని కేకలు వేస్తూ తిరిగాడు. తిరుపాలురెడ్డితో రాజీ చేయాలని గ్రామానికి చెందిన కొలూరి రహ్మతుల్లాను సురేంద్రబాబు కోరాడు. దీంతో తిరుపాలురెడ్డిని తన కుమారుడు నిజాముద్దీన్ ద్వారా రహ్మతుల్లా పిలిపించాడు. రాజీ చేస్తున్న సందర్భంలో తిరుపాలురెడ్డి తన వెంట తెచ్చుకున్న కత్తితో సురేంద్రబాబుతోపాటు సర్దిచెప్పబోయిన కొలూరి నిజాముద్దీన్, హజరత్‌పై దాడి చేశాడు. నిజాముద్దీన్‌కు మెడ, చేతులు, ఛాతీ భాగంలో తీవ్రగాయాలు కాగా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. హజరత్, సురేంద్రబాబుకు కూడా ఛాతీ, చేతులపై గాయాలయ్యాయి. నిజాముద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌కుమార్ తెలిపారు.

### పెద్దదోర్నాలలో రెండు బైక్‌లు చోరీ

పెద్దదోర్నాల: వేర్వేరు ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైన సంఘటనలు పెద్ద దోర్నాలలో చోటు చేసుకున్నాయి. బాధితుల కథనం మేరకు.. ఆదివారం రాత్రి పెద్ద బొమ్మలాపురానికి చెందిన గాలి ప్రతాప్‌రెడ్డి అయ్యప్పస్వామి గుడికి వెళ్లాడు. స్వామివారి దర్శనం అనంతరం వచ్చి చూడగా గుడి ముందు పార్కు చేసి ఉన్న బైక్ కనిపించలేదు. అలాగే, సోమవారం మధ్యాహ్నం నటరాజ్ సెంటర్‌లో పార్క్ చేసి ఉంచిన దుగ్గెంపూడి అల్లారెడ్డి బైక్‌ను దుండగులు అపహరించారు. బైకుల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

### 30 గ్రాముల బంగారం చోరీ


బీరువాను పరిశీలిస్తున్న రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు

జె.పంగులూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన జె.పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంజి అంకమ్మరావు భార్య అనిత పొలం పనుల నిమిత్తం ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. సాయంత్రం 3 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువా తలుపులు తెరిచి చూడగా మూడు జతల కమ్మలు, రెండు మాటీలు, ఒక చెయిన్, ఒక తాళిబొట్టును గుర్తుతెలియని దొంగలు అపహరించారు. మొత్తం సుమారు 30 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లారు. రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో అనిత ఫిర్యాదు చేయడంతో ఎస్సై సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### జాతీయ స్థాయి కరాటేలో జిల్లా విద్యార్థుల సత్తా


జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు

ఒంగోలు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం విజయవాడలో ముగిసిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అండర్-8, 10, 12, 14, 16 విభాగాల్లో జిల్లా నుంచి 61 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఏపీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 800 మందికిపైగా విద్యార్థులు తలపడ్డారు. అందులో జిల్లాకు చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు 20 గోల్డ్ మెడల్స్, 18 సిల్వర్, 23 బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. వీరిని సంఘ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

**కటా విభాగంలో మెడల్స్ సాధించిన బాలురు...**

ఎస్‌వీఎస్ సాయి అనురూప్, పి.మన్విత్, పి.తేజవర్ధన్, డి.యశ్వంత్, సాయిరామ్ శౌర్య, కె.నంద కిషోర్, ఎల్.వి క్రాంత్ సాయి శ్రీనివాస్, సీహెచ్ ఆషర్, టి.హేష్ వెంకట సాయి (గోల్డ్), టీవీ జగత్ నాగసాయి, కె.సాయి అఖిలేష్ యాదవ్, కె.కౌశిక్ సాయి ప్రజ్వల్, యు.షణ్ముఖ్ వరుణ్, జె.రుత్విక్ బాబు, డి.జాహిద్ ఖాశిం, బి.నాగహనీఫ్, జి.కుశాల్ గుప్తా (సిల్వర్), సీహెచ్ ఖాజారహంతుల్లా, బి.కుషాల్‌రెడ్డి, ఎస్.తనూజ్, ఎం.రోషన్ సాయి, పి.మనోజ్ సాయి చరణ్, ఎస్‌కే అయాన్, ఆర్.నాగలోకేష్, పి.మోక్షజ్ఞ, వి.గౌతం వర్షిత్, జి.శౌర్య, ఎస్.జశ్వంత్, ఎ.లిఖిత్ సాయినందన్, జి.సూరజ్ కృష్ణ యాదవ్, డి.మహేష్ సాయి (బ్రాంజ్)

**కటా విభాగంలో మెడల్స్ సాధించిన బాలికలు...**

జి.లాస్యచరణ్వీరెడ్డి, కె.యోషిత, పి.కీర్తిక, బి.హరిప్రియ, డి.లావణ్య, ఎస్ఎస్ఎస్ దీపాంజలి, డి.శ్రీజ, సీహెచ్ గీతాంజలి, కె.అనన్య, పీయూ ప్రవీణ, టి.జయశ్రీరెడ్డి (గోల్డ్), ఎం.కీర్తి, టి.జోషిక, వి.మన్వితారెడ్డి, వి.నందిక, ఎం.నాగరుషిత, జి.చాతుర్య, సీహెచ్ హేమప్రియ, వి.జయకీర్తి, కె.అమూల్య, కె.తేజ (సిల్వర్), జి.జ్యోత్స్న, ఈ.దేదీప్య, టి.జోషిక, జి.గ్రేషియో, ఎల్.ధరణిశ్రీ, ఎల్.ఆకాంక్ష, జి.వర్ధినిరెడ్డి, సీహెచ్ అక్షర.

# అయ్యో.. అయ్యప్పా..!

- ● ఆటో బోల్తా పడి అయ్యప్ప దీక్షలో ఉన్న బాలుడు మృతి
- ● మరికొందరికి స్వల్ప గాయాలు
- ● భిక్ష స్వీకరించి వస్తుండగా ప్రమాదం
- ● తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు


మృతి చెందిన గురుప్రసాద్

దొనకొండ: ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో అయ్యప్ప దీక్షలో ఉన్న 15 ఏళ్ల బాలుడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాల మలుపు వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక బ్రహ్మారావుపేటకు చెందిన బత్తుల నారాయణ కుమారుడు గురుప్రసాద్(15) దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు.

తోటివారు మాల ధరించడంతో తాను కూడా మాల వేసుకుంటానని మారాం చేశాడు. కుమారుడి కోరికను కాదనలేని తల్లిదండ్రులు మాల ధరించేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో తోటి అయ్యప్ప దీక్షధారులతో కలిసి సోమవారం మధ్యాహ్నం భిక్ష స్వీకరించేందుకు స్థానిక అద్దరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లాడు. అందరూ కలిసి ఆటోలో తిరిగి ఇంటికి బయలుదేరారు. అయితే కేజీబీవీ పాఠశాల మలుపు వద్ద వేగ నియంత్రణ కోల్పోయి ఆటో బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్ స్పృహ కోల్పోగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గురుప్రసాద్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం దర్శికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.విజయ్‌కుమార్ పరిశీలించి ప్రమాద ఘటనపై వివరాలు సేకరించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గురుప్రసాద్ మృతదేహాన్ని జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు.

### యోగాలో సత్తాచాటిన చందలూరు విద్యార్థులు

జె.పంగులూరు: జాతీయ స్థాయి యోగా పోటీలకు చందలూరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 1 నుంచి మూడు రోజుల పాటు నెల్లూరులో 68వ యోగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎస్.శ్రుతి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ప్రతిమ సోమవారం తెలిపారు. నేషనల్ స్టాండ్‌బైలో కే సరిత ఎంపికై నట్లు తెలిపారు. టీమ్ ఈవెంట్‌లో చందలూరు విద్యార్థులు 3వ స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.